AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
20-6-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


తెయూ తీరే వేరు..! 2






2 ఆర్మూర్ 'మంగళం శీను' రాకేశ్‌రెడ్డి : జీవన్‌రెడ్డి


## కంజర సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు



**అక్షరటుడే, ఇందూరు:** కంజర మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్‌లో అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. 2026-27 విద్యాసంవత్సరానికి గాను..ఇంటర్ ఫస్టియర్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 23న ఎంజేపీ పాఠశాల, కంజర్‌లో స్పాట్ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. MPC గ్రూప్‌లో అడ్మిషన్ల కోసం ఎస్సెస్సీలో 500మార్కులకు పైగా వచ్చిన బాలబాలికలు అర్హులన్నారు.



## పోచంపాడ్ వద్ద కేటీఆర్‌కు ఘనసన్మానం

**అక్షరటుడే, మెండోరా :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పోచంపాడ్ ఎక్స్ రోడ్ వద్ద ఆగారు. ఈ సందర్భంగా ప్రార్టీ శ్రేణులు ఆయనను ఘనంగా సన్మానించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్వాగత కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, యువ నాయకుడు బాజిరెడ్డి జగన్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ జెండాలతో, నినాదాలతో నాయకులు కేటీఆర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ముచ్చటించిన కేటీఆర్ స్థానిక హోటల్‌లో టీ తాగారు. అనంతరం ఆయన ఆదిలాబాద్ వెళ్లారు.

# విచారణపై ఉత్కంఠ..!

**కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య రేగిన వివాదం గాంధీభవన్‌కు చేరింది. పోటాపోటీ ఫిర్యాదులతో అట్టుడికిన పరిస్థితులపై క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా దృష్టి పెట్టింది. ఇప్పటికే ఒక దశ విచారణ పూర్తి కాగా, రెండో దశ విచారణకు రంగం సిద్ధమైంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



- రేపు క్రమశిక్షణ కమిటీ ముందుకు షబ్బీర్ అలీ
- వివాదాస్పద అంశంలో సంబంధం ఉన్న నేతలూ రావాలని ఆదేశం
- ఇటీవల ముగిసిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి విచారణ
- భవిష్యత్తు పరిణామాలపై కొనసాగుతున్న ఉత్కంఠ

పక్షం రోజులుగా కామారెడ్డి కాంగ్రెస్ రెండుగా చీలింది. సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గాల మధ్య పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి విభేదాలు ముదిరాయి. ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకోవడంతో పరిస్థితి చేయిదాటింది. దీంతో రంగంలోకి దిగిన క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని పిలిచి విచారించింది.

### మరోసారి షబ్బీర్ అలీ..

సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆదివారం గాంధీభవన్‌లోని క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకానున్నారు. కామారెడ్డి వివాదంపై ఆయన వాదన వినేందుకు కమిటీ సిద్ధమైంది. ఇప్పటికే ఆయన మాట్లాడినట్టుగా వైరల్ అయిన ఆడియోపై షబ్బీర్ అలీ కమిటీకి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ప్రస్తుతం మరోసారి కమిటీ రావాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. గత పక్షం రోజులుగా నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, ఫిర్యాదులపై ఆయన నుంచి కమిటీ సభ్యులు వివరణ తీసుకోనున్నారు.

### సంబంధం ఉన్న నేతలు రావాలని..

కేవలం షబ్బీర్ అలీ ఒక్కరే కాదు.. ఈ అంశంతో సంబంధం ఉన్న నేతలంతా విచారణకు రావాలని కమిటీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆదివారం గాంధీభవన్ కామారెడ్డి నేతలతో కిక్కిరిసిపోనుంది. అయితే కమిటీ ముందు ఎవరు హాజరవుతారు అనేదానిపై పొలిటికల్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఫిర్యాదులలో పేర్కొన్న అందరూ కమిటీ ముందు హాజరవుతారా లేదా చూడాలి.

### ముగిసిన చంద్రశేఖర్ రెడ్డి విచారణ..

ఈ వివాదంలో మరో కీలక నేత గడ్డం చంద్రశేఖర్ రెడ్డి విచారణ ఇప్పటికే ముగిసింది. ఈనెల 11న కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఆయన వివరణ ఇచ్చారు. అలాగే గత శుక్రవారం మరోసారి ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతో కలిసి కమిటీ ముందు విచారణకు హాజరయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు, తనపై వచ్చిన ఆరోపణలపై ఆయన వివరణ ఇచ్చారు. షబ్బీర్ అలీ విచారణతో కామారెడ్డి వ్యవహారంపై కమిటీ ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కమిటీ తన నివేదికను పీసీసీ చీఫ్‌కు, అధిష్టానానికి సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగానే అధిష్టానం చర్యలు ఉంటాయని తెలుస్తోంది.



## సర్కారు పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం..

### అడ్మిషన్ రిజిస్టర్ మాయం..

**అక్షరటుడే, బోధన్:** సర్కారు పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఏకంగా అడ్మిషన్ రిజిస్టర్ మాయం అవడంపై విమర్శలు వస్తున్నాయి. బోధన్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న జేసీ ఉన్నత పాఠశాలలో రిజిస్టర్ మాయమైంది. కొన్నిరోజులుగా అడ్మిషన్ రిజిస్టర్ కనిపించడం లేదు. విద్యాసంవత్సంరం ప్రారంభం అయిన నేపథ్యంలో అడ్మిషన్ల కోసం వచ్చే తల్లిదండ్రులకు వేరే రిజిస్టర్ పెట్టి అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2019 నుంచి విద్యార్థుల, వివరాలు నమోదై ఉన్న రిజిస్టర్ కనిపించకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కారణంగా రిజిస్టర్ మాయమైందని.. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామని హెచ్‌ఎం పేర్కొన్నారు.




## 'నీట్'కు ఏర్పాట్లు పూర్తి.. కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఆదివారం జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న 'నీట్'కు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. నీట్ పరీక్ష పునః నిర్వహణ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 3,456 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఈ మేరకు జిల్లా కేంద్రంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల/కళాశాల, బోధన్ పట్టణంలో రైల్వే గేట్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో, డిచ్పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల బిల్డింగ్, మాక్లూర్ లోని బిగాల కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

## రైతుబీమా పథకాన్ని నిర్వీర్యం చేయడం బాధాకరం: ఎమ్మెల్యే కేవీఆర్



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని నిర్వీర్యం చేయడం బాధాకరమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఎమ్మెల్యే కేవీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఐసీకి ప్రభుత్వం రూ.442 కోట్లు ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ప్రీమియం చెల్లించకపోవడంతో 7,606 మంది రైతులు నష్టపోతున్నారని తెలిపారు. వీళ్లందరూ కుటుంబ పెద్దను కోల్పోయిన అనంతరం ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎదురు చూస్తున్నారన్నారు. పంట నష్టపోయి, అప్పులపాలై రైతులే బాధపడుతున్నారని, కనీసం రైతుకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ పథకాన్ని ఏ పార్టీ మొదలు పెట్టినా దానిని ఎలా ముందుకు తీసుకుని వెళ్తున్నామనేది మాత్రమే ముఖ్యమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి రైతు బీమా పథకానికి సంబంధించి ఎల్ఐసీకి చెల్లించాల్సిన రూ.442 కోట్ల ప్రీమియం చెల్లించి 7,606 మంది రైతు కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.




## జిల్లాలో 'నీట్'కు పక్కాగా ఏర్పాట్లు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'నీట్'కు పక్కగా ఏర్పాటు చేశామని జిల్లా పోలీసు శాఖ తెలిపింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో 'నీట్'కు పటిష్టమైన పోలీసు భద్రత కల్పించామని అధికారులు తెలిపారు. ఆదివారం పరీక్ష జరగనున్న గిరిరాజు కళాశాల, డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ, గవర్నమెంట్ జూనియర్ కళాశాల బోధన్, నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల, మాక్లూర్ బిగాల కృష్ణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ నాగారంలలో పూర్తి ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష జరిగే సమయాల్లో పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఇంటర్నెట్ సెంటర్లు. జిరాక్స్, స్టేషనరీ దుకాణాలను పూర్తిగా మూసివేయాలని యజమానులకు సూచనలు జారీ చేసినట్లు వారు తెలిపారు.

## ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు..




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని బిగాల అన్నారు. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి అనే సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక వినూత్న పథకాలను అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేసీఆర్ హయాంలో రైతును రాజుగా భావించి రైతు సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. రైతులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఎకరానికి ఏడాదికి రూ.10,000 చొప్పున పెట్టుబడి సహాయం అందించారని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచారని తెలిపారు. తెలంగాణ లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి లక్షల ఎకరాలకు నీరందించడం ద్వారా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం మూడు శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ 50 శాతానికి పైగా వాటా సాధించి దేశానికే అన్నపూర్ణగా నిలిచిందంటే అది కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. రైతుబంధు పథకం ద్వారా సుమారు రూ.77 వేల కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని, రైతులకు రూ.27వేల కోట్లకు పైగా రుణ సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. రైతు కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో కుటుంబ పెద్దను కోల్పోయిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించారని తెలిపారు. కానీ కాంగ్రెస్ రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, జగత్ రెడ్డి, బిల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల నియామకాలు తప్పు పట్టడం తగదు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో 2012 ఏడాది నోటిఫికేషన్ ద్వారా 2014లో భర్తీ అయిన అధ్యాపకుల నియామకాన్ని తప్పు పట్టడం తగదని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ పేర్కొంది. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టూటా అధ్యక్ష, కార్యదర్శులు పున్నయ్య, మోహన్ బాబు మాట్లాడారు. ఇటీవల కొందరు వ్యక్తులు చేసిన ఆరోపణలు పూర్తిగా ఏకపక్షమైనవన్నారు. వాస్తవాలను దాచిపెట్టేవి, న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని తప్పుగా చిత్రీకరించేలా ఉన్నాయని పేర్కొన్నారు. హైకోర్టు లో అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగా సింగిల్ జడ్జి తీర్పును అంతిమ తీర్పుగా ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని వివరించారు. రిట్ అప్పీల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఉత్తర్వుపై ఇంటీరిమ్ సస్పెన్షన్ మంజూరు చేసిందన్నారు . 2014లో నియామకమైన అధ్యాపకులకు పదోన్నతి కల్పించాలని ప్రభుత్వం తేల్చి చెప్పిందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా. సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బాలకిషన్, డాక్టర్ నీలిమ, ప్రతినిధులు జమీల్, ప్రసన్న రాణి, విద్యావర్ధిని, డా. వాసం చంద్రశేఖర్, డా . అంజయ్య, నాగరాజు, సబితా, లక్షణ చక్రవర్తి, ప్రసన్న శీల ఉన్నారు.



## రైతులను పట్టించుకోని ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



**అక్షరటుడే, కామారెడ్డి:** రైతుల సమస్యలను పట్టించుకోకుండా, కాంగ్రెస్ అరిగోస పెడుతుందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి వారి ఉసురు పోసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. గత సీజన్‌లో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడ్డారని, కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యం సైతం రైస్ మిల్లులకు వెళ్లలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రైతులు స్వయంగా రోడ్డెక్కి ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రెండు రోజుల క్రితం మంత్రులతో జరిపిన సమావేశంలో కేంద్రం ఎంత కోటా ధాన్యం కొనుగోలు చేస్తుందో అంతే కొంటామని సీఎం చెప్పడం దారుణమన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రైతు దీక్షలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తే రైతులు పండించిన ఏ పంట అయినా కొనుగోలు చేయవచ్చని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రం చెప్పిన మాటే చెప్పడానికి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు ఎలాంటి వడ్లు పండించినా రూ.500 బోనస్ అని చెప్పి, ఇప్పుడు సన్నరకం వడ్లకేనని మాట మార్చారని, తాజాగా తక్కువ దిగుబడి వచ్చే 7 రకాల ధాన్యానికే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను దగా చేయడమేనని మండిపడ్డారు. ఇది సన్న రకం వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు చేసే కుట్రలో భాగమేనని అన్నారు. గతంలో 24 గంటలు ఇచ్చిన విద్యుత్‌ను ఇప్పుడు 11 గంటలకు తగ్గించిన చేతకాని, చేవ చచ్చిన దమ్ములేని ప్రభుత్వమిదని గంప గోవర్ధన్ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసర్ల స్వామి, ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కుంబాల రవి యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు హాఫీజ్ భేగ్, పిట్ల వేణు, గెరిగంటి లక్ష్మీనారాయణ, లోలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో రెండో రోజు నిరసన

**అక్షరటుడే, మెండోరా:** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల ఆందోళన రెండో రోజుకు చేరుకుంది. టీజీపీఈజేఏసీ నాయకులు సతీష్, రఫీక్, దేవరాజ్ నాయకత్వంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌తో పాటు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



## కూతురిని ప్రభుత్వ బడిలో చేర్పించిన సర్పంచ్

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** యానంపల్లి సర్పంచ్ తోట భాస్కర్ తన కూతురు తోట అనన్యను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించారు. తద్వారా గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్.. మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, ఉపాధ్యాయుల పట్ల పూర్తి నమ్మకంతో తన కూతురును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించానన్నారు. గ్రామంలో అందరూ కూడా తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్రీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 22న దోస్త్ స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** డిగ్రీ అడ్మిషన్ల కోసం 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ చేసుకున్న స్పెషల్ కేటగిరి విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు దోస్త్ సమన్వయకర్త డా. వాసం చంద్రశేఖర్ యాదవ్ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో వెరిఫికేషన్ ఉంటుందన్నారు. దివ్యాంగ, సీఏపీ, ఎన్సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యూలమ్ కేటగిరి విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన కోరారు.



## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు..

**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలం సావెల్ గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. చీతాఫోర్స్ నిర్వహించిన మెరుపు దాడుల్లో ఈ ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. అనంతరం వీటిపై కేసులు నమోదు చేసినట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష నిర్వహణలో తెలంగాణ యూనివర్సిటీ తీరు విమర్శలకు తావిస్తోంది. వర్సిటీ సిబ్బంది ఉన్నప్పటికీ బయటి వారికి విధులు కేటాయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

- అక్షరటుడే, తెయూ క్యాంపస్




# తెయూ తీరే వేరు..!

■ 'నీట్' విధుల్లో బయటి వ్యక్తులకే పెద్దపీట.. ■ విమర్శల పాలవుతున్న వర్సిటీ అధికారులు ■ అనుమానాలకు తావిస్తున్న అధికారుల తీరు

నీట్' పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరి ఎంపిక నిబంధనలకు అనుగుణంగా, నిష్పాక్షికంగా జరగాల్సి ఉంటుంది. అయితే తెలంగాణ యూనివర్సిటీలో నీట్ పరీక్ష కేంద్రాల నిర్వహణలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీలో అనుభవజ్ఞులైన సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ, వారిని పక్కనపెట్టి బయటి వ్యక్తులకు విధులు అప్పగించడం అనుమానాలకు తావిస్తోంది. ఉద్యోగుల వర్గాల సమాచారం ప్రకారం పరీక్షా నిర్వహణలో అనుభవం ఉన్న ఉద్యోగులకు అవకాశం ఇవ్వకుండా, అధికారులకు పరిచయం ఉన్న వ్యక్తులు, బంధువులు, వారి సిఫార్సుతో వచ్చిన వారికే ఎక్కువ ప్రాధాన్యం కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం 'నీట్' పరీక్ష జరగనుంది. ఈ వ్యవహారం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

### విధుల కేటాయింపులో బంధుప్రీతి?

పరీక్ష విధుల్లో తమకు తెలిసిన వ్యక్తులకు, బంధువులకు, పరిచయస్తులకు విధులు ఇప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్షల విధుల్లో పాల్గొంటే అదనపు పారితోషికం లభించే అవకాశం ఉండటంతో ఈ విధులపై ఆసక్తి ఎక్కువగా ఉంటుందని ఉద్యోగులు చెప్తున్నారు. నీట్ వంటి జాతీయ పరీక్షల్లో చిన్న పొరపాటు జరిగినా దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తుంది. ఇలాంటి పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఎంపికలో కూడా స్పష్టమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అవి పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతినే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఏళ్లుగా యూనివర్సిటీలో సేవలందిస్తున్న ఉద్యోగులకు అవకాశం ఇవ్వకుండా, బయటి వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

### సొంత సిబ్బంది ఉన్నప్పటికీ..

యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో చాలా మందికి గతంలో పరీక్షల నిర్వహణలో అనుభవం ఉంది. అయినప్పటికీ వారిని పరిగణనలోకి తీసుకోకుండా, బయటి వ్యక్తులకు విధులు వేయడంపై యూనివర్సిటీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాణాలతో బయటి వ్యక్తులను ఎంపిక చేస్తున్నారని, పారదర్శకత పాటించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఎవరెవరి సిఫార్సుతో వారికి అవకాశం ఇచ్చారని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.?



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటో సౌకర్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం రాంచంద్రపల్లి గ్రామ పరిధిలోని వడ్డెర కాలనీ, తండా విద్యార్థులకు సర్పంచ్ తొగర్ల భూషణ్ తన సొంత ఖర్చులతో ఆటోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులను సురక్షితంగా, సమయానికి స్కూల్‌కు చేరవేసే విధంగా ఈ ఆటో సేవను ప్రారంభించామన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి దృష్ట్యా రవాణా సమస్యలు ఎదురుకాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డ్ సభ్యులు వడ్డెర కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరస్తుల గుర్తింపు



**అక్షరటుడే, ఆర్మూర్:** సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఏదైనా సంఘటన జరిగినప్పుడు నేరస్తులను సులభంగా గుర్తించవచ్చని ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్ అన్నారు. మన కాలనీ-మన భద్రత-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్మూర్ పట్టణంలోని దొండి మెడికల్, లార్డ్స్, మొబైల్ షాప్‌లలో ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



## ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలలో యోగా డే


**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు, యోగాసనాలు వేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు, వాటితో కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త శంకరయ్య, టీఎస్‌కేసీ సమన్వయకర్త శివకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్ చంద్రకాంత్, జి.రాణి , అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి భారీగా మంజూరు: ఎమ్మెల్యే మదన్ మోహన్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థుల భవిష్యత్‌ను బలోపేతమే లక్ష్యంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పాఠశాలలు, బీసీ హాస్టళ్లలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఎమ్మెల్యే అభివృద్ధి నిధుల నుంచి మొత్తం రూ.85.50 లక్షలను మంజూరు చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిధులను కేటాయించారు. ఎల్లారెడ్డి మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు, లింగంపేట్ మండలంలో బీసీ బాలుర వసతి గృహం మరమ్మతుల కోసం రూ.8 లక్షలు మంజూరు చేశారు. అలాగే రాజంపేట్ మండలంలోని గూడి తండా - ఎంపీపీఎస్‌లో కొత్త తరగతి గదుల నిర్మాణానికి రూ.5 లక్షలు, తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కొత్త తరగతి గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. సదాశివనగర్ మండలంలోని బీసీ బాలుర హాస్టల్ మరమ్మతుల కోసం రూ.2.50 లక్షలు, కల్వరాల్ గ్రామం జడ్పీహెచ్ఎస్‌లో తరగతి గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు, నాగిరెడ్డిపేట మండలం, తాండూర్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రహరీ నిర్మాణం, ఫ్లోరింగ్ పనుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆర్మూర్ 'మంగళం శీను' రాకేశ్‌రెడ్డి : జీవన్‌రెడ్డి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిని 'ఆర్మూర్ మంగళం శీను' అంటూ జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఎర్ర చందనం స్మగ్లర్' అంటూ కామెంట్ చేశారు. పుష్ప సినిమాలో మంగళం సీను క్యారెక్టర్ ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తుంది. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఆర్మూర్‌లో భూముల కబ్జా జరుగుతోందని, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆట స్థలాన్ని కూడా ఎమ్మెల్యే ఆక్రమించుకున్నారని ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోందని.. హామీలిచ్చి మరిచిన కాంగ్రెస్ నాయకులను తరిమి కొట్టాలని జీవన్ రెడ్డి అన్నారు. ఈ సీఎం రేవంత్ రెడ్డి కాదు.. హిట్లర్ రెడ్డి అని ఈ హిట్లర్ రెడ్డి మోదీ, బాబు కనుసైగల్లో పని చేస్తున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. పవన్ కళ్యాణ్ సినిమాలు హిట్ అయినంత మాత్రాన సీఎం అవుతానని అనుకుంటే అది భ్రమేనని అన్నారు. పాన్ డబ్బాల లెక్క పది పార్టీలు పుడితే అందులో ఒక తోక పార్టీ జనసేన పార్టీ అని విమర్శించారు. తమ కౌన్సిలర్లకు ప్రోటోకాల్ ఇవ్వకుంటే 2000 మందితో మున్సిపాలిటీని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతు మిత్రుడిగా రైతు బంధు అందిస్తే, రేవంత్ రెడ్డి బూతుబంధుగా మారారని అన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగుల పాలిట రేవంత్ రెడ్డి ఒక హిట్లర్‌లా మారాడని విమర్శించారు. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదని, హిట్లర్ రాజ్యంగా, ఎమర్జెన్సీ రాజ్యంగా మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మాజీ జడ్పీటీసీ సంతోష్, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.




## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**అక్షరటుడే, బోధన్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నవీపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం యోగా ఆసనాలు వేశారు. ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులకు యోగా విశిష్టతను, దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యతను పాఠశాల హెచ్ఎం గంగామణి వివరించారు. ఉదయం చేయాల్సిన శ్వాసక్రియ కసరత్తు, విద్యార్థులకు ఉపయుక్తమైన ఆసనాలను పాఠశాల పీడీ డాక్టర్ రవీందర్ అబ్బాపూర్ విద్యార్థులతో చేయించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం సాయంత్రం పాఠశాల విద్యార్థులతో యోగా ఆంగ్ల అక్షరాలతో వివిధ ఆసనాలతో నిర్వహించిన కసరత్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, పీడీతో పాటు ఉపాధ్యాయులు భూమయ్య, లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, రవీంద్ర కుమార్, మహమ్మద్ వాయిద్, సుధాకర్ రెడ్డి, విశ్వనాథ్, శ్రీకాంత్, రఘుపతి, సతీష్, సురేఖ, సుభాషిని, రాధా, భారతి, పాఠశాల సిబ్బంది హేమలత, లక్ష్మీనర్స బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశంలో హరివిల్లు.. సప్తవర్ణ శోభితం

**ఆకాశంలో విరిసిన ఇంద్రధనుస్సు మెల్లగా జారి.. నేలను తాకినట్లుగా ఉన్న ఈ సుందర దృశ్యం శనివారం పోతంగల్ మండల కేంద్రంలో ఆవిష్కృతమైంది. ఒకవైపు కారుమబ్బులతో సన్నటి జల్లులు.. మరోవైపు మేఘాల చాటు నుంచి భానుడి కిరణాలు.. ఈ రెండింటి కలయిక మధ్య ఏడు రంగుల హరివిల్లు వికసించింది. ఇంద్రధనుస్సు అంచులు భూమిని తాకుతున్నట్లుగా కనిపించిన ఈ దృశ్యం స్థానికులు, వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచింది.**

– ఎన్నవార్ రాజు, అక్షరటుడే కోటగిరి ప్రతినిధి

